# ఎంతో గొప్ప మర్మము

(ఆయన పునరుత్థాన శక్తి)

భక్త్‌సింగ్

తృతీయ ముద్రణ : అక్టోబరు, 1990. ప్రతులు : 2000
చతుర్థ ముద్రణ : మే, 2002. ప్రతులు : 5000

పుస్తకములు కావలసినవారు ఈ క్రింది
అడ్రసుకు వ్రాయమనవి

**బుక్-రూమ్**
**హెబ్రోను**
గోల్కొండ చౌరస్తా
హైదరాబాదు - 500 020.

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్. ఫోన్ : 7618261, 7653348

# ఉపోద్ఘాతము

యేసుక్రీస్తు ప్రభువు యొక్క పునరుత్థాన శక్తిని గూర్చిన అంశము మిగుల ప్రాముఖ్యమైనది. ఈ శక్తి ద్వారానే యేసుక్రీస్తు ప్రభువు మృతులలో నుండి లేపబడి, సమస్తమైన అధిపత్యము కంటెను, అధికారము కంటెను, శక్తి కంటెను, ప్రభుత్వము కంటెను, ఈ యుగము నందు మాత్రమే కాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతి నామము కంటెను హెచ్చుగా హెచ్చింపబడెను (ఎఫెసీ. 1:21). మనము అన్నింటిలో అత్యధిక విజయము పొంది, అమర్త్య దేహములు కలిగి యేసు క్రీస్తు ప్రభువుతో రాజులముగా, యాజకులముగా యుండునట్లుగా ఈ శక్తి ఎంతో మహిమ కరముగా, ప్రత్యక్షపరచబడెను. "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తు నందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ. 1:3). అపొస్తలుడైన పౌలు ఈ మాటలను హృదయపూర్వకమైన స్తుతి, ఆరాధనతో పలికెను. మొదటి అధ్యాయములోని మొదటి భాగములో, మన ప్రేమ గల దేవుడు భూమి పునాదులు వేయకమునుపే మన కొరకై ఏర్పాటు చేసిన గొప్ప ఆత్మీయ ఆశీర్వాదములను గూర్చి చెప్పబడెను. ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచుకొనుట ద్వారా, మన పక్షముగా కల్వరిలో ఆయన ముగించిన కార్యమునందు విశ్వాస ముంచుట ద్వారా, ఈ ఆశీర్వాదములన్నియు ఎట్లు సమృద్ధిగా అనుభవించగలమో అను విషయము 14వ వచనము నుండి చెప్పబడినది. ఈ సందర్భములో పౌలు ఎఫెసులోని విశ్వాసులను గూర్చి ఈ రీతిగా ప్రార్థించెను. "ఆయన క్రీస్తు నందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తియొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో మీరు తెలిసికొన

వలెనని... నేను నా ప్రార్థనలయందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను. ఆయన ఆ బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండి లేపి... ఎంతో హెచ్చుగా పరలోకము నందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ. 1:19-23). యేసుక్రీస్తు ప్రభువును మృతులలో నుండి లేపి, ఎంతో ఉన్నతముగా ఆయనను హెచ్చించిన శక్తియే మనలో కూడ పోయబడినది. అయితే అనుదిన అక్కరల కొరకై ఈ శక్తిని అన్వయించు కొనలేక ఎంతో మంది విశ్వాసులు ఆత్మీయముగా ఎంత దరిద్రులై యున్నారు!

# ఆయన శక్తి యొక్క మూడంతల కార్యము

ప్రథమముగా యేసుక్రీస్తు ప్రభువు నందు విశ్వాసముంచి ఈ శక్తిని అంగీకరించుట ద్వారా మనము నీతిమంతులముగా చేయబడుచున్నాము. "ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి, మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" అని రోమా 4:25లో చదువుచున్నాము. అబ్రాహాము 75 సంవత్సరముల వయస్సు గలవాడైనప్పుడు అతనికి కుమారుని యిచ్చెదనని దేవుడు వాగ్దానము చేసెను. ఆ వాగ్దానము కొరకై అబ్రాహాము, శారా 25 సంవత్సరములు వేచి యుండవలసి వచ్చెను. వారిద్దరు బహు వృద్ధులైన పిమ్మటనే, గర్భము ధరించు కాలము గతించిన పిమ్మటనే ప్రభువు తన వాగ్దానమును నెరవేర్చెను. వారు వారి దేహములలోనికి నూతన శక్తిని అనగా మరణమును జయించు పునరుత్థాన శక్తిని పొందితేనే తప్ప కుమారుని పొందజాలరని దేవుడు వారికి తెలియచేసెను. అప్పుడే వారు దేవుని యెదుట నీతిమంతులైరి. "అందుచేత అది అతనికి నీతిగా ఎంచబడెను. అది అతనికి ఎంచబడెనని అతని నిమిత్తము మాత్రమే కాదు గాని మన ప్రభువైన యేసును మృతులలో నుండి లేపిన వాని యందు విశ్వాసముంచిన మనకును ఎంచబడునని మన నిమిత్తము కూడ వ్రాయబడెను" (రోమా 4:23-25). సామాన్యమైన విశ్వాసముతో పునరుత్థాన శక్తిని పొందినవారే నిత్యత్వములో దేవుని యెదుట నీతిమంతులు కాగలరు.

రెండవదిగా, అదే శక్తి ద్వారా ప్రభువు తన వాగ్దానము ప్రకారము దూతలతో, పరిశుద్ధులతో వచ్చునప్పుడు మనకు మహిమకరమైన, అమర్త్యమైన దేహములు యివ్వబడును. "మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించిన యెడల, మృతులలో

నుండి క్రీస్తుయేసును లేపిన వాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపచేయును" (రోమా 8:11).

మూడవదిగా, ఈ శక్తిని అన్వయించుకొనుట ద్వారా అనుదినము మనము ఎదుర్కొను నటువంటి పరీక్షలను, శోధనలను జయించెదము. ఫిలిప్పీ. 4:13 ప్రకారము ఆయన ద్వారా సమస్తమును చేయగలము. మనము అనారోగ్యముగా నున్నప్పుడు స్వస్థతను ఏలాగు కోరుకొందుమో, ఆయన వాక్యమును గ్రహించుటకు జ్ఞానమును ఏలాగు కోరుకొందుమో, ఆ రీతిగానే మన అక్కరల కన్నింటికి విశ్వాసము ద్వారా పునరుత్థాన శక్తిని కోరుకొనవలయును. ఆ శక్తి ద్వారా మానవ హద్దుబాటు లన్నింటిని మనము జయించగలము. ఆ శక్తి మన పరిస్థితులన్నింటికి, పరీక్షలన్నింటికి అందుబాటులో కలదు, యిటువంటి గొప్ప అద్భుతమైన శక్తిని అన్వయించుకొనుట ద్వారానే దేవుని పనిలో బహు భారమైన పనులను చేయగల్గెదము. బాధ్యతలను కూడ నిర్వహించ గల్గెదము.

అనుదినము మన అక్కరలన్నింటికి పునరుత్థానశక్తిని పొందుట ఎంతో అవసరమై యున్నది. యేసుక్రీస్తు ప్రభువు మన పాపముల కొరకై రావలసిన తీర్పును మనకు బదులుగా తానే భరించి చనిపోయెననియు, మనలను శుద్ధీకరించుటకు తన ప్రశస్తరక్తము కార్చెననియు, మనలను నీతిమంతులుగా తీర్చుటకు తిరిగి లేచెననియు మనము విశ్వాసముంచినప్పుడు ఆయన మన స్వంత రక్షకుడగును. అట్టి విశ్వాసము ద్వారా ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచబడెదము (రోమా. 6:5). ఈ దినము లలో శ్రేష్ఠమైన మామిడిపండ్లు, బత్తాయిపండ్లు, అంటుకట్టబడుట ద్వారానే ఉత్పత్తి అగుచున్నవి. పుల్లటి పండ్లు ఫలించెడి చెట్లు, మంచి

ఫలములు, రుచికరమైన ఫలములు ఫలించగలదు. మంచి చెట్టుతో ఈ చెట్టు అంటుకట్టబడుట ద్వారా మంచి చెట్టు యొక్క సారము ఈ చెట్టులోనికి వచ్చును. కనుక అది మంచి ఫలములు ఫలించును. అపొస్తలుడైన పౌలు ఈ సాదృశ్యమునే వాడుచున్నాడు. మనము ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థానములలో ఐక్యపరచబడవలెను. ఆయన మరణశక్తి ద్వారా మన పాత స్వభావమునకు మరణించెదము. పునరుత్థాన శక్తి ద్వారా యేసుక్రీస్తు ప్రభువులో నూతన సృష్టిగా చేయబడెదము. 2 కొరింథీ 5:17లో చెప్పబడిన ప్రకారము అన్నియు క్రొత్తవగును. మన అక్కర కొలది విశ్వాసము ద్వారా ఈ శక్తిని అనుదినము అన్వయించుకొని, ఈ శక్తిని అనుభవించవలెనని ప్రభువు కోరుచున్నాడు.

అపొస్తలుడైన పౌలు దేవుని ద్వారా ఎంతో బలముగా వాడబడినప్పటికిని, అనేక సంఘములు స్థాపించుటలో దేవుడు అతనిని వాడుకొనినను, మూడవ ఆకాశమునకు సహా అతడు ఎక్కి పోయినను, మానవ భాషలో వర్ణించలేని మాటలు అతడు వినినప్పటికిని, ప్రభువును, ఆయన పునరుత్థాన శక్తిని ఎరుగవలెనని కోరెను (ఫిలిప్పీ 3:10).

ఆది సంఘములో విశ్వాసులు ప్రభువుయొక్క పునరుత్థానమును గూర్చి గొప్ప అధికారముతో సాక్ష్యమిచ్చిరి. దేవుని కృప వారిని ఆవరించి యుండెను. గనుక విశ్వాసులుగా ఈ గొప్ప పునరుత్థానశక్తిని మన జీవితములలో అన్వయించుకొనుటకు నేర్చుకొనవలెను.

యేసుక్రీస్తు ప్రభువు పునరుత్థానుడైన తరువాత నలుబది దినములలో పది పర్యాయములు శిష్యులకు కనబడెను. పునరుత్థాన దినమున ఐదుమార్లు కనబడెను. రెండవ దినము నుండి

ఆరోహణమగు వరకు ఐదుసార్లు కనిపించెను. ఆయన యందు ఎవరైతే విశ్వాసముంచలేదో వారికి ఒక్కసారియైనను ప్రత్యక్షము కాలేదు. ప్రతిసారి కూడ కేవలము తన శిష్యులకే కనిపించెను; ఆయన సిలువలో వ్రేలాడుచున్నప్పుడు, "యిప్పుడు సిలువ మీద నుండి దిగినయెడల వాని నమ్ముదుము" (మత్తయి 27:42), అని అనేకమంది పరిహాసము చేసిరి. అయితే ఆయన తిరిగి లేచిన తరువాత వారిలో ఎవరికైనను కనిపించలేదు. అనగా ఎవరైతే యేసు ప్రభువు నందు విశ్వాసముంచి ఆయనను స్వంత రక్షకునిగా అంగీకరించి, నీతిమంతులుగా చేయబడెదరో, వారు మాత్రమే ఈ పునరుత్థాన శక్తిని అనుభవించగలరనియు; కేవలము వారికి మాత్రమే ఈ శక్తి అందుబాటులో యుండుననియు దాని భావము. రోమా 4:24, 25 లలో చెప్పబడినట్లు ఆయన తిరిగి లేచుట ద్వారా ఎవరు నిత్యత్వము వరకు ఆయన దృష్టిలో నీతిమంతులుగా చేయబడిరో వారు మాత్రమే ఈ శక్తిని పొందెదరు. ప్రతిసారి ఆయన ప్రత్యక్షమైనప్పుడు మరణమును జయించిన ఈ శక్తిని ఏ రీతిగా అన్వయించుకొని, అత్యధిక విజయమును అనుభవించగలమో అను రహస్యమును బయలు పరచెను. దైవ స్నేహములోని మర్మమును తెలియచేయు నిమిత్తము నలుబది సంవత్సరములలో దేవుడు అబ్రాహామునకు పదిసార్లు ప్రత్యక్షమాయెను. 2 దిన వృ. 20: 7; యెషయా 41:8; యాకోబు 2:3లో అబ్రాహాము దేవుని స్నేహితుడని పిలువబడెను. దేవునితో స్నేహము చేయుటకు పది మెట్లు కలవు. అట్లే ప్రభువు తన శిష్యులకు పదిసార్లు ప్రత్యక్షమగుట ద్వారా, ఆయన పునరుత్థాన శక్తిలోని పదంతల రహస్యమును తెలియచేసెను. మన అక్కరలన్నింటికి ఆ శక్తిని పొందగలము. ఈ శక్తి ద్వారానే ఒక దినమున మనము ఆయనను ముఖాముఖిగా చూడగలమనియు, ఆయనను పోలియుండగలమనియు నిరీక్షించుచున్నాము. ఈ పది ప్రత్యక్షతల లోని కొన్ని విషయములను గమనింతము.

## మొదటి ప్రత్యక్షత (యోహాను 20:1-8)

మొదట యేసుప్రభువు పునరుత్థాన దినమున మరియకు కనబడెను. మరియ, యితర స్త్రీలు, ప్రభువు దేహమునకు తైలము పూయవలయునని సమాధికి వెళ్ళిరి. అయితే అక్కడ సమాధి తెరువబడి యుండెను. సమాధి ఖాళీగా ఉండుట చూచి, శిష్యులతో ఈ సంగతి చెప్పుటకు ఆమె పరుగెత్తి వెళ్ళెను. ఆమె తిరిగి వచ్చి సమాధి దగ్గర ఏడ్చుచు నిలువబడెను. అప్పుడు యేసు ప్రభువు ఆమెకు కనిపించి, "అమ్మా, ఎందుకు ఏడ్చుచున్నావు? ఎవరిని వెదకుచున్నావు?" అని అడిగెను. ఆమె ఆయన తోటమాలి అని తలంచి, "అయ్యా, నీవు ఆయనను మోసికొనిపోయిన యెడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము. నేను ఆయనను ఎత్తికొనిపోవుదును" అనెను. ఈ విషయము యోహాను 20:14,15లో చదివెదము. ప్రభువు యెడల ఆమెకెంతో భక్తి యున్నను, ఆయన తిరిగి లేచి యున్నాడను విషయము ఆమె గ్రహించలేక పోయెను. ఆయనను ప్రేమించి, ఆయన యందు విశ్వాసముంచిన వారికి ఆ శక్తిని అనుగ్రహించునట్లు ఆయన పునరుత్థానుడయ్యెనని ఆమె ఎరుగనందున ఏడ్చుచుండెను. ఆమె ప్రక్కనే యేసుప్రభువు నిలిచి యుండెను. ఆమెతో మాట్లాడెను. అయినను ఆమె ప్రభువును గుర్తుపట్టలేదు గనుకనే ఏడ్చుచుండెను. ఈ దినములలో స్వల్పమైన పరిశోధనలకే విశ్వాసులు ఏడ్చుచుండుట ప్రపంచములో ప్రతిచోట చూడగలము. అయితే ప్రతి పరిస్థితిలో మనము జయించువారముగా యుండవలయునని ప్రభువు కోరుచున్నాడు. వారి ప్రతి అక్కరలో పునరుత్థానశక్తిని ఎట్లు పొందవలయునో వారు ఎరుగనందువలననే ఏడ్చుచున్నారు.

ప్రభువు ఆమెను 'మరియా' అని తన పేరుతో సంభోధించగానే ఆమె ప్రభువును గుర్తించెను. ప్రభువు యెడల తనకున్న అనురాగము, భక్తి కనబరచుటకు ప్రభువు పాదములు ముట్టుకొనగోరెను. అయితే

ప్రభువు ఆమెతో "నేను ఇంకను తండ్రి యొద్దకు ఎక్కిపోలేదు. గనుక నన్ను ముట్టుకొనవద్దు అయితే నా సహోదరుల యొద్దకు వెళ్ళి నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడునైన వాని యొద్దకు ఎక్కి పోవుచున్నానని వారితో చెప్పుమనెను" (యోహాను 20:17). కొంత సమయమైన పిదప ఆయన సమాధి నుండి వచ్చుచున్న కొందరు స్త్రీలకు కనిపించెను. వారు ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 28:9). అట్లు చేయుటకు ఆయన వారికి సెలవిచ్చెను. ఎనిమిది దినములైన పిమ్మట ఆయన తోమాకు కనిపించి "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివిగాక విశ్వాసివై యుండుమనెను" (యోహాను 20:27). మరియ ఎంతో భక్తి కలిగినదైనను, తనను ముట్టుకొనుటకు ఆమెకు అనుమతినివ్వలేదు. ఒక ఉద్దేశముతోనే ప్రభువు ఆమెను ముట్టుకొననివ్వలేదు. ఆయనను ఎవరైనను ముట్టుకొనక పూర్వమే తాను తండ్రి యొద్దకు ఎక్కి పోవలసి యుండెను. మన నిత్యమైన ప్రధాన యాజకుడుగా తన రక్తము తీసికొని అతి పరిశుద్ధ స్థలములోనికి మన పక్షముగా వెళ్ళవలసి యుండెను. "మేకల యొక్కయు, కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12). క్రీస్తు ప్రభువు ప్రధాన యాజకుడుగా వచ్చి తానే నిత్యమైన విమోచన సంపాదించెను. కీర్తన 16:10లో ప్రవచించబడిన ప్రకారము ఆయన శరీరము, రక్తము కుళ్ళుపట్టలేదు. క్రీస్తు ప్రభువు మన ప్రధాన యాజకుడుగా మన పాపముల ప్రాయశ్చిత్తము కొరకు తన రక్తమును తన స్వహస్తములతో దేవునికి అర్పించెను. మన పాపపు తలంపుల ద్వారా, మాటల ద్వారా, క్రియల ద్వారా మలినపరచబడిన మనస్సాక్షిని శుద్ధీకరించుటకు తన రక్తమును కార్చెను. మనము ఆయన పునరుత్థాన శక్తిని అనుభవించవలయునన్న, మొదట ఆయన దగ్గర కనిపెట్టుటకును, ఆయన స్వరమును వినుటకును

నేర్చుకొనవలెను. మన అక్కర ననుసరించి ఆయన మాట్లాడు పర్యంతము వేచి యుండవలెను. ఆయన మనతో మాట్లాడుటకు పూర్వము తలంపులు, మాటలు, క్రియల ద్వారా కలిగిన అపవిత్రత నంతటిని నిత్య నిబంధన యొక్క ప్రశస్త రక్తముతో కడుగుకొనవలెను. విశ్వాసము ద్వారా ఎల్లప్పుడు ప్రశస్తమైన రక్త ప్రోక్షణ క్రిందికి రావలెను. అప్పుడే పునరుత్థానము యొక్క శక్తిని అనుభవించెదము.

## రెండవ ప్రత్యక్షత (మత్తయి 28:5-10)

రెండవసారి ప్రభువు సమాధి నుండి తిరిగి వచ్చుచున్న స్త్రీలకు కనిపించెను. ఆ స్త్రీలు సమాధి యొద్దకు వెళ్ళగా, అది ఖాళీగా నుండెను. అప్పుడు దూతవారికి కనిపించి "మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్లే ఆయన లేచి యున్నాడు; రండి. ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్ళి ఆయన మృతులలో నుండి లేచి యున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి; ఇదిగో ఆయన గలిలయ లోనికి మీకు ముందుగా వెళ్ళుచున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో మీతో చెప్పితిని" అని వారిని ఆదరించెను. వారు శిష్యులకు చెప్పవలయునని వెళ్లుచుండగా ప్రభువు వారిని ఎదుర్కొని "మీకు శుభము" అని పలికెను. వారు ఆయన యొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 28:5-9).

ఈ సారి ప్రత్యక్షమగుట ద్వారా సంతోషముతో, త్వరితముగా విధేయులగుట వలన పునరుత్థాన శక్తిని అనుభవించగలరని ప్రభువు తెలియచేసెను. ఏ విషయమును గూర్చియైనను ప్రభువు మనతో మాట్లాడినప్పుడు ఏ ప్రశ్న వేయకుండ వెనువెంటనే లోబడిన యెడల ఈ పునరుత్థాన శక్తిని ఎక్కువ పరిమాణములో పొందెదము. ఈ స్త్రీలు

ప్రభువు పునరుత్థానమును గూర్చి శిష్యులతో విపులముగా చెప్పి నప్పటికిని శిష్యులు సందేహించినట్లు లూకా 24:11లో చూచెదము. "వారి మాటలు వీరి దృష్టికి వెర్రి మాటలుగా కనబడెను. గనుక వీరు వారి మాటలు నమ్మలేదు." సందేహము, అనుమానము కలిగియున్నట్లయిన పునరుత్థాన శక్తిని పొందలేము. ప్రభువు మనతో ఏమి చెప్పినను వెంటనే లోబడుట ద్వారా ఆయన అడిగిన దానిని సంతోషముతో యిచ్చుట ద్వారా ఆయన పంపిన స్థలమునకు యిష్టపూర్వకముగా వెళ్ళుట ద్వారా ఈ అద్భుత శక్తిని అనుభవించ గలము. ప్రభువు మనలను ఏ పని చేయుమని కోరునో ఆ పని చేయుటకు ఈ శక్తి మన అందుబాటులో యుండును.

### మూడవ ప్రత్యక్షత (లూకా 24 : 33-35; 1 కొరింథీ. 15:5)

పిమ్మట పునరుత్థాన దినముననే ప్రభువు సీమోను పేతురుకు కనుపించినట్లు లూకా 24:34లో చదివెదము. "ప్రభువు నిజముగా లేచి సీమోనునకు కనబడెను." స్త్రీలు శిష్యుల యొద్దకు వచ్చి, సమాధి ఖాళీగా యున్నదనియు, ప్రభువు లేచి యున్నాడనియు చెప్పగానే సీమోను పేతురు పరుగెత్తి సమాధి దగ్గరకు ఏల వెళ్ళెనో మనము ఊహించుకొనగలము. "పేతురు లేచి సమాధి యొద్దకు పరుగెత్తుకొని పోయి వంగి చూడగా నార బట్టలు మాత్రము విడిగా కనబడెను. అతడు జరిగిన దానిని గూర్చి ఆశ్చర్యపడుచు ఇంటికి వెళ్ళెను" (లూకా 24:12). బహుశ పేతురు సమాధి నుండి తిరిగి వచ్చుచుండగా ప్రభువు అతనిని కలిసికొని యుండవచ్చును. పేతురు ఆయనను ముమ్మారు బొంకినందులకు క్షమాపణ కోరుకొనుటకు అవకాశమివ్వవలయునని ప్రభువు అతనిని కలిసికొనెను. ఆయన సమృద్ధియైన కృపను అనుభవించి, ప్రభువు యొుక్క క్షమాపణ పొందుటలో పేతురు ఎంత గొప్ప ఆనందము అనుభవించి యుండును.

ప్రభువు పాదముల దగ్గర మనలను మనము ఎంతగా తగ్గించు కొందుమో, ఆయన సన్నిధిలో ఎంతగా విరిగి, నలిగి యుందుమో అంతగా ఆయన పునరుత్థాన శక్తిని అనుభవించెదము. ఈ పేతురే తన మొదటి పత్రిక 5వ అధ్యాయము, 6వ వచనములో ఇట్లు వ్రాసెను. "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతి క్రింద దీన మనస్కులై యుండుడి." "మీరందరు ఎదుటివానియెడల దీన మనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి" అని 5వ వచనములో వ్రాసెను" "తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" (మత్తయి 23:12). ప్రభువు సిలువ వేయబడక పూర్వము తానే శిష్యుల పాదములు కడిగెను. దీని ద్వారా నిజమైన సేవ అనగా ఏమో ఆయన తెలియచేసెను. మనలను మనము విరుగగొట్టుకొని నిజమైన దీనత్వముతో యితరులకు ఎట్లు సేవ చేయవలయునో మనకు తెలియచేసెను. యెషయా 57:15 ప్రకారము పరిశుద్ధుడును, బలవంతుడైన దేవుడు రెండు స్థలములలో మాత్రమే నివసించును. "పరిశుద్ధుడును, నిత్య నివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు : నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడను అయినను వినయము గల వారి ప్రాణమును ఉజ్జీవింపచేయుటకును నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింప చేయుటకును వినయము గలవారి యొద్దను దీన మనస్సు గలవారి యొద్దను నివసించు చున్నాను." పరిశుద్ధుడైన దేవుడు హస్త కృతాలయములలో వసింపడు. మత్తయి 11:29లో ప్రభువు ఇట్లు చెప్పెను. "నేను సాత్వికుడను, దీన మనస్సు గలవాడను... గనుక నా యొద్ద నేర్చుకొనుడి." ఆయన సన్నిధిలో దీనులముగా యుండుటకు మన జీవితకాల పర్యంతము నేర్చుకొనవలెను. దేవుడు మన మధ్యలో, మన ద్వారా గొప్పగా పని

చేయునప్పుడు అతిశయించి, ఉప్పొంగుట చాలా సులభము. ప్రభువు యొక్క మహిమను మనము దొంగిలించకుండ ఆయన మనలను కాపాడి, తన సన్నిధిలో మనలను దీనులుగా యుంచును గాక!

**నాల్గవ ప్రత్యక్షత (లూకా 24 : 13-35)**

ప్రభువు నాల్గవసారి ఎమ్మాయు గ్రామమునకు వెళ్ళుచున్న యిద్దరు శిష్యులకు కనబడెను. యెరూషలేములో సంభవించిన వింతైన సంగతులను గూర్చి వారు మాట్లాడుచుండిరి. సమాధి దగ్గరకు వెళ్ళిన స్త్రీలు ప్రభువును చూచినట్లు చెప్పిరి. ప్రభువు మృతులలో నుండి లేచి యున్నాడని దూత వారితో చెప్పెను. యేసుక్రీస్తు ప్రభువు వారితో నడచుచు, లేఖనములను వారికి అధికారముతో వెల్లడి చేసెను. అయితే వారు ఆయనను గుర్తు పట్టలేదు. సాయంకాలమైనప్పుడు వారి కోరిక ప్రకారము ఆయన వారితో నుండుటకు వచ్చినప్పుడు, భోజన సమయములో యూదుల ఆచారము ననుసరించి, ఆయన కృతజ్ఞతాస్తుతులు చెల్లించి రొట్టె విరువగా వారు ఆయనను గుర్తుపట్టిరి. రొట్టె విరుచు సమయములో ప్రభువు చివరి రాత్రి భోజనమప్పుడు చెప్పిన మాటలు వారికి జ్ఞాపకము వచ్చెను. "మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరము." అప్పుడే వారు దాని అర్థమును గ్రహించిరి. ఆయన మన పాపముల కొరకై తన దేహము విరుగగొట్టబడుటకిచ్చెననియు, మన పాప పరిహారార్థము తన ప్రశస్త రక్తము చిందించెననియు వారు తెలిసికొనిరి.

ప్రభువు మన పాపముల కొరకై సిలువలో మరణించినందులకు మనము హృదయపూర్వకముగా వందనములు చెల్లించినప్పుడే ఈ అద్భుతమైన పునరుత్థాన శక్తిని అనుభవించెదము. అందువలననే ఆదివారమునాడు ప్రభువు బల్లచుట్టు చేరి ఆరాధించుట ఎంతో ప్రాముఖ్యమైనది. ఆ ఆరాధన మనకెంతో సహాయపడును. నిజముగా

ఆరాధన సమయము ఎంతో ప్రశస్తమైనది. ఏ సంఘములలో నైతే ప్రతి ఆదివారము ప్రభువు బల్లచుట్టు చేరి విశ్వాసులు హృదయపూర్వకముగా ఆరాధించి, సంగతులు సరి చేసికొని ప్రభువు బల్లలో యోగ్యముగా పాలుపొందెదరో ఆ సంఘములు ఆత్మీయముగా వర్ధిల్లును. అట్టివారు ఆత్మీయముగా విశాలమైన స్థలములోనికి వచ్చెదరు. అయితే ప్రభువు బల్ల విశ్వాసులకు ఒక ఆచారముగా పరిగణింపబడుట శోచనీయము. ప్రభువు బల్లలో పాలుపొందక పూర్వము ఆరాధన యొక్క విలువను వారు గమనించరు. అందువలననే వారి జీవితములు నిష్ఫలముగా యున్నవి. ప్రభువు బల్లచుట్టు చేరి ఆరాధనలో గడుపుట విశ్వాసులకు ఎంతో అవసరమై యున్నది. ఆ రీతిగా ఆరాధించినప్పుడే ఆత్మీయముగా ఎదుగగలరు. ప్రభువు జ్ఞానములోను, కృపలోను ఎదుగగలరు.

**ఐదవ ప్రత్యక్షత (యోహాను 20 : 19-25)**

పునరుత్థాన దినమున సాయంకాలమందు యెరూషలేములో శిష్యులు ఒక గదిలో కూర్చుండి యుండగా ప్రభువైదవమారు వారి మధ్యలో కనిపించెను. తలుపులు మూసియుండగా, ప్రభువు వారి మధ్య నిలచెను. "మీకు సమాధానము కలుగును గాక" అని పలికెను (యోహాను 20:19). మరల 21వ వచనములో ఈ మాటలనే పలికెను. అనగా మన అంతరంగ సమాధానమును కాపాడుకొనుట ద్వారానే ఈ పునరుత్థాన శక్తిని అనుభవించగలము. మన సమాధానమును పాడుచేయుటయే శత్రువు పని. ఆ సమాధానమును తొలగించ వలెననియే శత్రువు అనేక రకములైన భయములను, సందేహములను శరీర సంబంధమైన శోధనలను మన హృదయములోనికి రానిచ్చును. అయితే మనలను మనము తగ్గించుకొని, ఆయన ప్రశస్త రక్తము ద్వారా శుద్ధీకరించబడినప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన సమాధానమును అనుభవించెదము. "నీ ధర్మ శాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదు" (కీర్తనలు 119:165) అని దేవుని వాక్యము

చెప్పుచున్నది. మనము ఎంత ఎక్కువగా సమాధానమును కాపాడుకొందుమో అంత ఎక్కువగా శత్రు పన్నాగములను, దాడులను జయించెదము. అయితే సమాధానము మన హృదయములలో నుండి నదివలె ప్రవహించు నట్లు మనము బలమైన విశ్వాసము కలిగి యుండుటకు అభ్యాసము చేసికొనవలెను. ఒక వేళ దేవునితోనైనను, మనుష్యులతోనైనను ఏదైనను సరిచేసికొనవలసి వచ్చిన, ఆయన కృపతో దీనత్వము కలిగి వెంటనే సరిచేసికొనవలయును. అంతరంగములో అధికమగుచున్నటువంటి, విస్తరించుచున్నటువంటి, ఆత్మీయమైన సమాధానము కలిగి యుండుట ద్వారానే దేవుని చిత్తమును నిశ్చయముగా ఎరుగగలము. ఎందుకనగా నీతి సమాధానము కలుగచేయును (యెషయా 32:17). మరల ప్రభువు తన శిష్యులతో, ''తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్ములను పంపుచున్నాను'' అని యోహాను 20:21లో చెప్పెను. ఈ అంతరంగ సమాధానము మనము కలిగియున్నప్పుడే ఆయన మనలను ఎక్కడకు పంపినను వెళ్ళుటకు ఇష్టపడెదము. ఆయన మనలను ఏమి అడిగినను ఆయన మహిమార్థమై దానిని యివ్వగలము. ఆయన శిష్యులతో ఈ విధముగా మాట్లాడిన పిమ్మట వారి మీద ఊది "పరిశుద్ధాత్మను పొందుడి" అని చెప్పెను (22వ వచనము). మనము ఆయనకు లోబడుకొలది, తన పనిని సాగించుటకు, తన ఆజ్ఞను నెరవేర్చుటకు మనకు కావలసిన పరిశుద్ధాత్మ అభిషేకము నిచ్చును.

**ఆరవ ప్రత్యక్షత (1 కొరింథీ. 15:6)**

1 కొరింథీ. 15:6 ప్రకారము ఆరవమారు ఐదు వందల మంది సహోదరులకు ఆయన ప్రత్యక్షమాయెను. ఆయన పునరుత్థానుడయ్యెనను సమాచారము అందరికి తెలియగానే, దాగియున్న విశ్వాసులందరు కలిసి సమావేశమగుటకు ప్రారంభించిరి. అట్టి విశ్వాసుల సంఖ్య ఐదు వందలు మించెను. వారందరు ఒక స్థలములో కూడి యుండగా

ప్రభువు వారికి కనిపించెను. ఘనము విశ్వాసులముగా మానవుల ద్వారా ఏర్పడిన వ్యత్యాసము లన్నింటిని జయించి ఒకే కుటుంబము గా కూడినప్పుడు, ఆయన పునరుత్థాన శక్తిని అనుభవించగలమని ఈ మారు ప్రత్యక్షమగుట ద్వారా ప్రభువు వెల్లడి చేసెను. ప్రభువు గెత్సేమనే తోటకు వెళ్ళక పూర్వము యిట్లు ప్రార్థించెను : "తండ్రీ, నా యందు నీవును నీ యందు నేనును ఉన్న లాగున వారును మన యందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నా యందు విశ్వాస ముంచువారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:21). ఈ అధ్యాయములో ప్రభువు చేసిన ప్రార్థనను చూచెదము. అనేకులను పురికొల్పు ప్రార్థనగా ఈ ప్రార్థన వ్రాయబడినది. విశ్వాసులమైన మనలో నాలుగంతల ఐక్యత, ఏకత్వము యుండవలెనని ప్రభువు ప్రార్థించెను. మొదటిగా మన సంబంధములో ఏకత్వము; రెండవదిగా ప్రేమలో ఏకత్వము; మూడవదిగా పరిపూర్ణతలో ఏకత్వము; నాల్గవదిగా మహిమలో ఏకత్వము. జాతి, కుల, సాంఘిక భేదములు మరచిపోయి ఎంత సన్నిహితముగా ఒకే కుటుంబముగా జీవించెదమో అంత సన్నిహితము గా ప్రభువుతో నుందుము. ప్రభువుకును, యితర విశ్వాసులకును సమీపముగా యుండుట ద్వారా బలమైన విశ్వాసము కలిగి ఈ పునరుత్థాన శక్తిని అనుభవించెదము. ఈ దినములలో స్వల్ప విషయములకే విశ్వాసులు వేరగుచున్నారు. ఈ రీతిగా వేరుపడుట ద్వారా అనేకులకు నష్టము కలుగును. అంతేకాక యిట్టి విభేదములు కలిగియున్నప్పుడు ఆత్మీయముగా శిశువులుగానే యుందురు. ఏ స్థలములో విశ్వాసులు ఒకే కుటుంబముగా ప్రభువు యొక్క శిరసత్వము క్రింద నుండి, ఒకరినొకరు సహించుచు, ఒకరినొకరు నిజమైన ప్రేమతో సేవించుచుందురో అక్కడే ఆత్మీయ ఎదుగుదల కనుపించును. అక్కడనే దేవుని వాక్యములోని లోతైన భావములు

వెల్లడియగును. దేవుని సన్నిధిని ఎడతెగక అనుభవించెదరు. ఆది క్రైస్తవులు ఒకే కుటుంబముగా కూడినప్పుడు ప్రభువు వారి మధ్యలో ధారాళముగాను, లోతుగాను పని జరిగించెనని దేవుని వాక్యములో చూచెదము. గత 34 సంవత్సరములలో ఇండియాలో పలు ప్రాంతములలో జరిగిన పరిశుద్ధ సమాజ కూడికలలో దీనిని అనుభవపూర్వకముగా ఎరిగితిమి. యిట్టి సహవాస సమయములో అందరిని సమానముగా ప్రేమించుటకు, నిష్పక్షపాతముగా యితరులకు సేవ చేయుటకును ఆధిక్యత కలిగెను.

## ఏడవ ప్రత్యక్షత (1 కొరింథీ. 15:7)

ఏడవసారి యేసుక్రీస్తు ప్రభువు యాకోబుకు ప్రత్యక్షమాయెను. 'తరువాత ఆయన యాకోబుకును, అటు తరువాత అపొస్తలులకందరి కిని కనబడెను" (1 కొరింథీ. 15:7). యాకోబు కూడ ముఖ్యమైన అపొస్తలులలో ఒకడు. అతని విషయము అపొస్తలుల కార్యములలో చదివెదము. పేతురు దేవదూత ద్వారా చెరలో నుండి విడిపించబడెను. అతడు యోహాను తల్లియైన మరియ యింటి తలుపు నొద్ద నిలుచుండి తట్టుచుండెను. విశ్వాసులు అతనిని చూచి విభ్రాంతి నొందిరి. "అతడు - ఊరకుండుడని వారికి చేసైగ చేసి, ప్రభువు తన్ను చెరసాలలో నుండి ఏలాగు తీసుకొని వచ్చెనో వారికి వివరించి యాకోబుకును సహోదరులకును ఈ సంగతులు తెలియచేయుడని చెప్పి బయలుదేరి వేరొకచోటికి వెళ్ళను" (అపొ. కా. 12:17). అపొస్తలుల కార్యములు 15.13లో కూడ యాకోబును గూర్చి చదివెదము. 'వారు చాలించిన తరువాత యాకోబు ఇట్లనెను. సహోదరులారా, నా మాట ఆలకించుడి." ఈ రెండు వాక్య భాగములనుబట్టి యాకోబు ముఖ్యమైన అపొస్తలుడనుటలో ఎటువంటి సందేహము లేదు. ఏ సలహాకైనను, తుది నిర్ణయము కొరకును యాకోబునే అడుగుచుండిరి.

అందువలననే ప్రభువు అతనికి కనబడెను. భవిష్యత్తులో ఆయన కొరకై నియమించబడిన గొప్ప ఆత్మీయ భాధ్యతలను నిర్వహించుటకై యాకోబును సిద్ధపరచు నిమిత్తము ప్రభువు అతనికి కనబడెను. దేవుని యింటిలో అధికమైన బాధ్యతలు భరించువారికి దేవుడు అధికశక్తిని, కృపను అనుగ్రహించును. అయితే చాలా మంది విశ్వాసులు కేవలము కూడికలకు వచ్చుటతో తృప్తి పడెదరు. ప్రసంగములు విని, పాటలు పాడుటయందు ఆనందించి వెళ్ళుటయే వారి లక్ష్యము. దేవుని గృహమును కట్టుటలో ఏ పాలు తీసికొనరు. దేవుని గృహ నిర్మాణములో వారి పాలు ఏమిటోనని వారు తలంచనే తలంచరు. యితరులకు సహాయపడుటలో, సేవ చేయుటలో ఎంత ఎక్కువగా ఆనందించెదమో, సువార్త వ్యాపకములోను, దేవుని గృహ నిర్మాణములోను ఎంత ఎక్కువగా బాధ్యత వహించెదమో అంత ఎక్కువ పునరుత్థానశక్తిని పొందెదము. అందువలననే పౌలు యిట్లు చెప్పెను. "ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తము... సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను" (ఫిలిప్పీ. 3:10,11). "నన్ను బలపరచు వాని యందే నేను సమస్తమును చేయగలను" అని కూడ పౌలు చెప్పెను (ఫిలిప్పీ. 4:13).

## ఎనిమిదవ ప్రత్యక్షత (యోహాను 20:24-29)

ఎనిమిదవసారి యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత ఎనిమిది దినములకు తోమాకు కనిపించెను. మొదట ప్రభువు శిష్యులకు కనిపించెను. అప్పుడు తోమా వారితో లేకుండెను (యోహాను 20:24). "మేము ప్రభువును చూచితిమి" అని శిష్యులు తోమాతో చెప్పగా అతడు -"నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి అయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మను" అని వారితో చెప్పెను. గనుక తోమా కొరకై

మరి యొకమారు ప్రభువు కనబడెను. ఈసారి శిష్యులతో కూడ తోమా యుండెను. అప్పుడు ప్రభువు వారికి కనిపించి తోమాను చూచి "నీ ప్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి గాక విశ్వాసివై యుండుము" అని చెప్పెను. అందుకు తోమా - "నా ప్రభువా, నా దేవా" అనెను. అప్పుడు యేసుప్రభువు "నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులు" అని అతనితో చెప్పెను. చిన్న బిడ్డవలె దేవుని వాక్యమునందు విశ్వాసముంచుట ద్వారా పునరుత్థాన శక్తిని అనుభవించెదము. కలల మీద గాని, దర్శనములు, సూచనలు, భావోద్రేకముల మీద ఆధారపడక, దేవుని మాటల యందే నమ్మకముంచవలెను. అప్పుడే ఈ శక్తిని పొందెదము. చాలా మంది విశ్వాసులు ఆత్మీయ ఎదుగుదల కొరకును, దేవుని శక్తిని పొందుటకును ఏదో సూచన మీద ఆధారపడుదురు. తత్ఫలితముగా ఆత్మీయముగా ఎండిపోయి, నిష్ఫలులగుదురు. ఆయన వాక్యమును చదువుచు, ఆయన వాగ్దానములను విశ్వాసముతో చేపట్టుట ద్వారా, ఎట్టి సందేహములు లేకుండ ఏ విషయములోనైనను ఆయనకు విధేయులమగుట ద్వారా పునరుత్థాన శక్తిని అనుభవించెదము.

## తొమ్మిదవ ప్రత్యక్షత (యోహాను 21 : 1-23)

తొమ్మిదవమారు యేసుక్రీస్తు ప్రభువు తిబెరియ సముద్రతీరమున శిష్యులకు కనబడెను. వారక్కడికి చేపలు పట్టుటకై వెళ్ళియుండిరి. రాత్రంతయు వారు ప్రయాసపడిరి గాని వారికేమియు దొరకలేదు. పెందలకడనే ప్రభువు వారికి కనిపించి - "పిల్లలారా, భోజనమునకు మీయొద్ద ఏమైనా యున్నదా? అని వారినడుగగా వారు, "లేదు" అనిరి. అప్పుడాయన "దోనె కుడిప్రక్కను వలవేయుడి మీకు దొరుకును"అని వారితో చెప్పెను (యోహాను 21:6). వారు ఆయన

చెప్పినట్లు చేయగా వలపట్టలేనంత విస్తారముగా చేపలు పడెను గనుక వారు ఆ వలను లాగ లేకపోయిరి. అందులో 153 పెద్ద చేపలుండెను. అయినను వల పిగలలేదు (యోహాను 21:11). ఈ అద్భుతము ద్వారా దేవుని సేవలో విస్తారముగా ఎట్లు ఫలించగలమో ప్రభువు తన శిష్యులకు తెలియచేసెను. మనలో అనేకులు యిక్కడకు అక్కడకు వెళ్ళుచు ఎంతో ప్రయాసపడుచున్నారు. కాని వారి ప్రయాసకు ఫలమేమియు లేదు. ఏలననగా వారు దేవుని ఏర్పాటు ననుసరించి ప్రయాసపడలేదు. అయితే మన అనుదిన కార్యక్రమము కొరకై దేవుని ఏర్పాటును, ఆయన చిత్తము నెరిగి, ఆ ప్రకారమే చేసినట్లయిన ప్రభువే మన మధ్య ఉండి మన ప్రయాసను ఫలింపచేయును. ఏ రీతిగా ఆ చేపలు ఆయనకు లోబడి ఎటువంటి పోరాటము లేకుండ ఆ వలలోనికి వెళ్లెనో, అదే రీతిగా మనమును ఆయన ఆజ్ఞను నెరవేర్చి, ఆయనకు లోబడవలెను. ఆయన అడుగు దానిని మనము ఆయనకివ్వవలెను. ఆ చేపలన్నియు క్రమముగా ఆ వలలోనికి వచ్చెను. ఎందుకనగా అవి తమ సృష్టికర్త యొక్క స్వరమును వినెను. అదే రీతిగా ఆయన సేవలో మనము కూడ ఎటువంటి పోరాటము, అసూయ కలిగియుండకూడదు.

శిష్యులు దరికి రాగానే అక్కడ నిప్పులును, వాటి మీద ఉంచబడిన చేపలును, రొట్టెయు కనబడెను (యోహాను 21:9). వారు ఆయనకు విధేయులైన యెడల వారి ప్రతి అక్కర ప్రభువే తీర్చునని వారికి ఈ రీతిగా తెలియచేసెను. మన విషయములో కూడ అంతే. వారు చలికాచుకొనునట్లు ఆయన అగ్నిని సిద్ధము చేసెను. అగ్ని, ప్రేమను చూపుచున్నది. అంతేకాక మనము ఆయన సేవలో ఆయనకు సంపూర్ణముగా లోబడినప్పుడు ఆయన ఆత్మ నింపుదలను పొంద గలమని కూడ అగ్ని తెలుపుచున్నది. మనము ఆయన ఆజ్ఞలను నెరవేర్చినప్పుడు ఆత్మలు రక్షింపబడును. చేపలు రక్షింపబడిన

ఆత్మలను చూపుచున్నవి. రొట్టె అనుదినము బలపరచబడుటకు మనము భుజింపవలసిన దేవుని వాక్యమును చూపుచున్నది. తరువాత ప్రభువు పేతురును, "యోహాను కుమారుడవైన సీమోనూ, వీరి కంటె నన్ను నీవు ఎక్కువగా ప్రేమించు చున్నావా?" అని ప్రశ్నించెను. పేతురు, "అవును ప్రభువా" అని చెప్పగానే యేసు ప్రభువు "నా గొఱ్ఱె పిల్లలను మేపుము. నా గొఱ్ఱె పిల్లలను కాయుము" అని చెప్పెను (యోహాను 21:15,16). అనగా మనము నిజముగా ఆయన గొఱ్ఱెపిల్లలను, ఆయన గొఱ్ఱెలను మేపుటకును, కాపుదల చేయుటకును నేర్చుకొనినప్పుడే మనము ఆయనను వాస్తవముగా ప్రేమించుచున్నామని అర్థము. యితరుల అక్కరలలో వారికి తోడ్పడి, యితరుల భారములు సంతోషముతో భరించి, త్యాగ సహితముగా యితరులకు సేవ చేసినప్పుడే మన ప్రేమ గల ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హృదయమునకు తృప్తి కలిగించిన వారమగుదుము. అప్పుడే మన ప్రధాన కాపరి మన యెడల తృప్తి నొందును.

## పదియవ ప్రత్యక్షత (లూకా 24:50-53)

చివరిగా, ప్రభువు బేతనియలో ఆరోహణుడు కాక పూర్వము తన శిష్యులకు కనిపించెను (లూకా 24:50). సర్వ లోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడని వారి కాజ్ఞాపించెను. "వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను; అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్ళుచుండగా, వారు ఆకాశము వైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారి యొద్ద నిలిచి - గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశము వైపు చూచుచున్నారు? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన ఈ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు

చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొ. కా. 1:9-11). ఆ రీతిగా ఆయన యొక్క ఆరోహణమునకు వారు సాక్షులైరి. అంతేగాక ఆయన మహిమతో తిరిగి వచ్చుననిన వాగ్దానమును కూడ పొందిరి. యోహాను 14:3 ప్రకారము తన వారిని తీసికొని వెళ్లుటకు ఆయన మరల వచ్చును. దేవుని ఏర్పాటు ననుసరించి మన చుట్టు ప్రక్కల నున్న వారందరికి సువార్తను చాటుట ద్వారా, ఆయన పునరుత్థాన శక్తిని పొందగలము. ఆదివారము నాడు ఆరాధనలోను, ప్రభువు బల్లలోను క్రమముగాను, నమ్మకముగాను పాలు పొందునట్లు యితర విశ్వాసులను ప్రేరేపించి, వారిని పురికొల్పుట ద్వారా ఆయన రెండవ రాకడ కొరకై వారిని సిద్ధపరచుట ద్వారా, ఈ శక్తిని అధిక పరిమాణములో పొందగలము.

మన అవసరతలన్నిటికిని ఆయన పునరుత్థాన శక్తిని అన్వయించు కొనుటకు ప్రభువు మనకు తోడ్పడును గాక!

◆ ◆ ◆